క్లుప్తంగా

నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై అవగాహన ర్యాలీ



మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

దర్శి: పట్టణంలోని భవిత కేంద్రం ఆధ్వర్యంలో దివ్యాంగుల విద్యార్థులతో ప్రపంచ డెస్లీక్సియా వారోత్సవం సందర్భంగా నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో ఎంపీడీఓ కృష్ణమూర్తి మాట్లాడుతూ దివ్యాంగుల్లో పురోభివృద్ధి పెంచడంపై అవగాహన కల్పించారు. మండల విద్యాశాఖాధికారులు రఘురామయ్య, రమాదేవి, శ్రీనివాసులు, లీలావతి పాల్గొన్నారు.

ఆనంద ఆశ్రమంలో 16 రోజుల పండగ



అమ్మవారికి చీరలు అందజేస్తున్న ఎంపీపీ దంపతులు

దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలో దేవీ శరన్నవ రాత్రుల 16 రోజుల పండగ సందర్భంగా మహిళలు ఈశ్వరీదేవి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. అమ్మవారిని పూలతో అలంకరించి పసుపు, కుంకుమ్మ అక్షతలు, హోమం చేశారు. దాతలు అమ్మవారికి అలంకరించిన 22 చీరలు, జాకెట్లు వితరణ చేశారు. ఉభయ దాతలు, మహిళా మూర్తులు ఎంపీపీ బొరిగొర్ల ఉషా మురళి దంపతులు, పిచ్చిరెడ్డి రమాదేవి దంపతులు, అంకాల బంగారయ్య అమ్మవారికి చీరలు అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భైరవానంద స్వామి వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు

యర్రగొండపాలెం: ప్రభుత్వ కళాశాలల్లో సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు పచ్చ రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, కె.ప్రతాప్‌కుమార్, ఆర్.రాజశేఖరరెడ్డి, జ్యోత్స్న ప్రియాంక, శ్రీనివాసరెడ్డి, మాధవి పాల్గొన్నారు.

కుక్కలను పట్టించిన పంచాయతీ అధికారులు



కుక్కలను పట్టుకుంటున్న సిబ్బంది

కురిచేడు: మండల కేంద్రం కురిచేడులో కుక్కల స్వైర విహారం ఎక్కువై ప్రజలను కరిచి గాయపరుస్తున్నాయి. ఇటీవల మూడు రోజుల వ్యవధిలో 15 మంది వరకు కుక్కల దాడిలో గాయపడ్డారు. కుక్కల స్వైర విహారం అనే శీర్షికతో 'సాక్షి' దినపత్రికలో బుధవారం ప్రచురితమైన కథనానికి స్పందించిన పంచాయతీ కార్యదర్శులు చాంద్‌బీ, కోటేశ్వరరావులు శుక్రవారం కుక్కలను పట్టించారు. సుమారు 100 కుక్కలను పట్టుకుని మినీ వాహనంలో తరలించారు. ఇంకా చాలా కుక్కలు ఉన్నాయని, వాటిని కూడా పట్టించాలని, కోతుల బెడద కూడా ఎక్కువగా ఉందని, వాటిని కూడా పంచాయతీ అధికారులు పట్టించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు వడ్డించే భోజనం నాణ్యంగా ఉండాలి



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవోలు శామ్యూల్ జాన్, ఇందిర

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈవోలు శామ్యూల్‌జాన్, ఇందిర అన్నారు. శుక్రవారం పుల్లలచెరువులోని పాఠశాలలో మధ్యాహ్న భోజనం వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు అందజేసే భోజనం పరిశుభ్రమైన ప్రదేశంలో రుచికరంగా ఉండాలన్నారు. రోజూ ప్రభుత్వం సూచించిన మెనూను మాత్రమే అమలు చేయాలని చెప్పారు.

అధ్వానంగా దువ్వలి రోడ్డు



బురదమయంగా ఉన్న దువ్వలి రోడు



ప్రయాణానికి ఇబ్బందికరంగా మారిన రోడ్డు

త్రిపురాంతకం: గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే మట్టి రోడ్ల పరిస్థితి దారుణంగా ఉంది. వర్షం పడితే బురద.. ఎండ కాస్తే దుమ్ములేపుతున్న రోడ్లు ప్రయాణానికి ఇబ్బందికరంగా మారింది. గ్రామీణ రోడ్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలోని లేళ్లపల్లి పంచాయతీ పరిధి దువ్వలి గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతిని పోయింది. లేళ్లపల్లి నుంచి దువ్వలి వరకు సుమారు ఐదు కిలోమీటర్లు ప్రయాణం చేసేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిందే. కేవలం మట్టి రోడ్డుపైనే ప్రయాణించాల్సి ఉంది. వర్షం వస్తే ఈ గ్రామం నుంచి బయటకు వచ్చేందుకు అవకాశం లేకుండా పోతోంది. రోడ్డుకు అడ్డంగా ఉన్న వాగులు సైతం రాకపోకలను నిలిపివేస్తుంటాయి. రోడ్డు మొత్తం బురదమయంగా మారిపోవడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. బురద రోడ్డుపై ప్రయాణం చేయాలంటే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. గ్రామానికి ఉన్న ఒక్క రోడ్డు బురదగా మారిపోవడంతో ద్విచక్ర వాహనాలు ప్రయాణించే పరిస్థితులు లేవు. ఆటోలు సాధారణ సమయంలో తిరుగుతాయి. వర్షం వస్తే అవి ఇటు వైపు చూడవు. వ్యవసాయదారులు పొలాలకు వెళ్లేందుకు, వ్యవసాయ అవసరాలు తీర్చుకునేందుకు బయటకు వచ్చే అవకాశం ఉండదు. వర్షం వస్తే స్కూల్ బస్‌లు ఇటువైపు చూడవు. ఇలా గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. మట్టి రోడ్డును తారు రోడ్డుగా మారుస్తామని ఎన్నికల సమయంలో నాయకులు హామీలు ఇచ్చినా రోడ్డు నిర్మించిన దాఖలాలు లేవు. కనీసం మెటల్ రోడ్డు నిర్మించైనా ప్రజల అవసరాలు తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తీర్మానం లేకుండా పనులు ఎలా చేస్తారు?



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కిరణ్‌గౌడ్



అధికారులను నిలదీస్తున్న సర్పంచ్ జయమ్మ

● అధికారులను నిలదీసిన సర్పంచ్ జయమ్మ

యర్రగొండపాలెం: పంచాయతీ తీర్మానం లేకుండా అధికారులు ఏ విధంగా పనులు చేపడతారని, అందుకు నిబంధనలు వర్తిస్తాయా.. అని మిల్లంపల్లి సర్పంచ్ ఏకుల జయమ్మ ముసలారెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సమావేశంలో ఆమె మాట్లాడారు. సర్పంచ్ ప్రమేయం లేకుండానే స్థానికంగా ఉండే కొంతమంది నాయకులను వేదికపై కూర్చోపెట్టి గ్రామసభలు నిర్వహించారని, ఆ సభలో తాను నిరసన తెలిపి బయటకు రావాల్సి వచ్చిందని, అటువంటి సభలో తీసుకున్న తీర్మానాలు పరిగణనలోకి తీసుకుంటారా.. అని ఆమె అధికారులను నిలదీశారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు తాము అడ్డుపడటం లేదని, పంచాయతీ తీర్మానం లేకుండా, ఎటువంటి అర్హతలేని వారితో కలిసి పనులు చేయించడం సరైన పద్ధతికాదని వైస్ ఎంపీపీ ఎం.ఆదిశేషు, సర్పంచ్‌లు డి.సుబ్బారెడ్డి, ఆర్.అరుణాబాయి అన్నారు. అధికారం ఉందని స్థానికంగా ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అధికారులు తమకిష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. ఎంపీపీ మాట్లాడుతూ స్థానిక ప్రజాప్రతినిధులను కలుపుకొని అధికారులు సమన్వయంగా ఆయా పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. పంచాయతీల్లో జరిగే పనులకు తీర్మానాలు ఇవ్వాల్సిన సర్పంచ్‌లను ప్రభుత్వ కార్యక్రమాలకు ఎందుకు ఆహ్వానించడం లేదని ఎంపీపీ ప్రశ్నించారు. స్థానిక ప్రజాప్రతినిధులను నిర్లక్ష్యం చేసి తమకు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలకు గురికావాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. రాజకీయ ప్రమేయం లేకుండా పంచాయతీల అభివృద్ధికి తోట్పడాలని కోరారు. పంచాయతీల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు సర్పంచ్‌తో పాటు స్థానికంగా ఉండే ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని ఎంపీడీవో బండారు శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు.

పంచాయతీ తీర్మానం లేకుండా గ్రామాల్లో పనులు చేయడం ఇబ్బందిగా ఉంటుందని, తామందరం ప్రభుత్వ ఆదేశాల మేరకు విధులు నిర్వర్తిస్తుంటామన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, ఎంపీడీవో డీటీ మల్లికార్జుననాయుడు, హెచ్‌వో పి.ఆదిరెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారి మాల్యాద్రిరెడ్డి, ఎంఈవోలు పి.ఆంజనేయులు, మల్లునాయక్, వివిధ విభాగాల ఏఈలు అల్లూరయ్య, అంజిరెడ్డి, జడ్సన్ పాల్, రవీంద్రరెడ్డి, ఏపీవోలు నాగేశ్వరరావు, శైలజ, ఏపీఎం శ్రీనివాసులు, వైద్యాధికారులు కోట నాయక్, మంత్రునాయక్, ఈవోపీఆర్డీ ఈదుల రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

వర్షానికి దెబ్బతిన్న పొగాకు పంట



నీరు నిలిచిన పొగాకు తోట



ముడత తెగులు..



ఆకు మచ్చలతో ఎండిపోతున్న పొగాకు

కురిచేడు: ఆరు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొగాకు పంట దెబ్బతింది. నిన్నటి వరకు వర్షాలు లేక పంటలు సాగు చేయలేదు. అడపాదడపా కురిసిన వర్షానికి సాగు చేసిన పంటలు నేడు వర్షార్పణమవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 1757 ఎకరాల్లో బర్లీ పొగాకు పంట, కందిపంట 13556 ఎకరాల్లో, మిరప 2078 ఎకరాల్లో, పత్తి 1259 ఎకరాల్లో, వరి 2019 ఎకరాల్లో , ఇతర పంటలు 3500 ఎకరాల్లో సాగు చేశారు. అందినకాడల్లా అప్పులు చేసి సాగు చేసిన పంటలు కళ్లెదుటే మునిగిపోయి నష్టం వాటిల్లుతుంటే చూడలేక రైతులు మనోవేదన అనుభవిస్తున్నారు. పంటలకు కొత్తగా తెగుళ్లు ఆశిస్తున్నాయని, పొగాకులో, మిరపలో ముడత తెగులు ఆశించిదని, దీంతో పాటు ఇంకా పురుగులు ఆశించే అవకాశం ఉందని, వాటికి మందు పిచికారీ చేయాలన్నా చేసేందుకు అవకాశం లేదని, పొలాలన్నీ బురదమయం కావడంతో చేలల్లోకి దిగలేని పరిస్థితి నెలకొని ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముందుగా సాగు చేసిన పొగాకు తోటలు కోతకు వచ్చాయి. ఇటీవల సాగు చేసిన పొగాకు పంటలలో నీరు నిలిచి ఉరకలెత్తుతున్నాయి. పంటలకు ముందుగా సాగు చేసిన పొగాకు పంట ఆకులు వర్షానికి మడ్డి కారిపోయి రంగు, తూకం తగ్గిపోయింది. అంతే కాకుండా పొగాకు చెట్లపైనే మచ్చలు ఏర్పడి ఎండిపోతోంది. నాణ్యతతో పాటు తూకం తగ్గుతోందని, నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో అయితే పత్తి పంట ముందుగా సాగు చేసిన పంటలో కాయలు వచ్చి పత్తి చేతికి అందుతుంది. వర్షాల కారణంగా చెట్టుకే పత్తి కారిపోయి పత్తిలోని విత్తనాలు మొలకెత్తి రంగుమారి పనికి రాకుండా పోయాయని, పంట మొత్తం నష్టంవాటిల్లినట్లు రైతులు పేర్కొంటున్నారు. మిరప తోటలు ఉరకలెత్తుతున్నాయి. ఇప్పటికి వరుణుడి ప్రకోపం తగ్గక పోవటంతో మిగతా పంటలు కూడా చేతికందకుండా పోతాయనే భయాందోళనలో రైతులు ఉన్నారు. పంట నష్టాన్ని అంచనా వేసి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

సాక్షి ఎఫెక్ట్..



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ నీరజ

పుల్లలచెరువు: అందని ఎరువులు..అన్నదాతకు తిప్పలు అనే శీర్షికతో శుక్రవారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి వ్యవసాయ శాఖ అధికారులు స్పందించారు. వ్యవసాయ శాఖ యర్రగొండపాలెం ఏడీఏ నీరజ మండలంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్‌లు, గోడౌన్‌లో ఉన్న స్టాకు వివరాలు పరిశీలించారు. ఏడీఏ నీరజ మాట్లాడుతూ మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 24,038 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారని, అందుకు మొత్తం 5225 టన్నుల ఎరువులు కావాలని జిల్లా అధికారులకు తెలియజేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం మండలంలోని ఎరువుల దుకాణాల్లో 80 టన్నుల యూరియా, 75 టన్నుల డీఏపీ, రైతు సేవా కేంద్రాల్లో 28.35 టన్నుల యూరియా ఉన్నట్లు తెలిపారు. 52 ఎంటి ఎరువుల కోసం వివిధ రైతు సేవా కేంద్రాల్లో ఇండెంట్ పెట్టినట్లు చెప్పారు. ఎరువులు కావాల్సిన రైతులు సమీపంలో రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన మందులు, ఎరువులు మాత్రమే అమ్మకాలు జరపాలని, రైతుల నుంచి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని ఏడీఏ నీరజ హెచ్చరించారు. ఆమె వెంట ఏవో నిర్మలాదేవి ఉన్నారు.

పారిశుధ్య పనులు చేయాలి



వీధి కుళాయి వద్ద పేరుకున్న మురుగు

ముండ్లమూరు (దర్శి): తమ గ్రామంలో పారిశుధ్య పనులు చేయాలని కోరుతూ బట్లపల్లి గ్రామస్తులు ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన యన్నబత్తిన వీరాయనేయులు గ్రామస్తులతో కలిసి మాట్లాడుతూ గ్రామంలోని ఉత్తర బజారులో కంభంపాడు వెళ్లే దారి పొడవునా వీధులు అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు. మురుగు నీరు నిల్వ ఉండి దోమలు ప్రబలుతున్నాయిని చెప్పారు. ఇళ్ల పరిసరాల్లో దిబ్బలు వేస్తూ దుర్వాసన వెదజల్లుతోందని, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు డెంగీ, డయేరియా వంటి రోగాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దోమలబెడద విపరీతంగా ఉందని, గ్రామంలో ఆరోగ్య శాఖ వారిచే అవగాహన కల్పించాలని కోరారు. గ్రామంలో మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. టి. రామయ్య, జి.గంగయ్య, ఎస్.మాల్యాద్రి, టి.వెంకటేశ్వర్లు, జి.గోపాలరావు, జి.కోటేశ్వరరావు, వై.సుబ్బారావు, టి. కృష్ణమూర్తి ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

వరిలో ఆకుచుట్టు పురుగు నివారణ



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి



తాళ్లూరు: పంటలు పరిశీలిస్తున్న ఏఓ ప్రసాద్‌రావు

దొనకొండ: గ్రామాల్లో సాగర్ కాలవ కింద వరి సాగు చేసిన రైతులు ఆకుచుట్టు పురుగు నివారించాలని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ సూచించారు. ఈ ఏడాది సాగర్ కాలువ నీరు సరఫరా కావడంతో మండలంలో సుమారు 600 ఎకరాల వరి సాగు చేశారు. శుక్రవారం రామాపురం రైతు సేవా కేంద్రం పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో కలిసి ఆయన వరి పొలాలను సందర్శించి రైతులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. ప్రస్తుతం వరి పైరులో ఆకుచుట్టు పురుగు ఆశించిందని, ఈ పురుగు వరి ఆకు పైభాగాన గూడు కట్టుకుని లోపల ఉంటూ పత్రహరితాన్ని గీకి తినడంతో ఆకులు తెల్లగా మారతాయన్నారు. రైతులు మజ్జిగ తెగులు, తెల్ల తెగులు అని పిలుస్తారన్నారు. వీటిని నివారించక పోతే పంట దిగుబడి తగ్గుతుందన్నారు. పురుగు సోకిన పొలాల్లో క్లోరోఫైరిఫాస్ లీటర్ నీటికి 2 మిలీ లేదా క్లోరా నత్ర నిలిప్రోల్ 3 మిలీ లేదా ఎఫిసెట్ 1.5 గ్రా చొప్పున 5 లీటర్ల వేప నూనెతో కలిపి పిచికారీ చేయాలన్నారు. వరి పొలంలో ఆకుకు కొసలు అక్కడక్కడా ఎరుపులోకి మారి ఎండి పోతుందన్నారు. దీన్ని నివారణకు ఎకరాకు 25 కేజీల పొటాష్ వాడాలన్నారు. రైతులు ఎక్కువ మోతాదులో ఉంటే నత్రజని ఎరువును వాడితే పురుగు ప్రభావం అధికంగా వచ్చేదానికి అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం వర్షపు జల్లులతో తేమ వాతావరణంతో ఆకు మచ్చ తెగులు వచ్చే అవకాశం ఉందని, ముందు జాగ్రత్తగా కార్బన్‌డైజామ్, మాన్‌కోజబ్ రెండు మందులు కలిపి చల్లుకోవాలన్నారు. రైతులు ఏవైనా సమస్యలుంటే రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని ఏఓ సూచించారు.

తాళ్లూరు (దర్శి): అధికారుల సూచనలు సలహాలు పాటించి పంటలను కాపాడుకోవాలని ఏఓ ప్రసాద్‌రావు సూచించారు. మండలంలోని బొద్దికూరపాడు, వెలుగువారిపాలెం, నాగంబొట్లపాలెం , రామబద్రాపురం గ్రామాల్లో క్షేత్ర పర్యటనల్లో భాగంగా పంటలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పంట చేతికి వచ్చిన సజ్జ, జొన్న, వరి పంటల్లో ఐదు శాతం ఉప్పుద్రావణం పిచికారీ చేసుకుంటే కంకులు, గింజలు మొలకెత్తవన్నారు. కోసిన కంకులు, కుప్పలపై పిచికారీ చేయాలని తెలిపారు. ప్రాథమికంగా సజ్జ 328 ఎకరాల్లో గింజ రంగు మారి అక్కడక్కడా బాగా తడిచిన కంకులు మొలకలు వచ్చాయన్నారు. వరి 100 ఎకరాల్లో జొన్న 7.30 ఎకరాల్లో ఉన్నట్లు చెప్పారు. ఇంకా పలు గ్రామాల్లో క్షేత్ర పర్యటనలు చేస్తున్నామన్నారు.

దివ్యాంగులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



పుల్లలచెరువు ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు

పుల్లలచెరువు: దివ్యాగులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవోలు శామ్యూల్ జాన్, ఇందిర అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మానసిక వికలాంగుల విద్యను ప్రోత్సహించడంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న మానసిక వికలాంగ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారికి కేటాయించిన ఉపాధ్యాయులు వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. వారిలో మానసిక స్థైర్యాన్ని పెంపొందించాలన్నారు. వారిలో ఉండే మానసిక లోపాలను గుర్తించి వారు కుంగిపోకుండా చేసి వారిలో లోపాలను సరిదిద్దే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

సర్ చార్జీలు పెంచొద్దు



ముండ్లమూరు: నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు



దర్శి: ప్లకార్డులతో ఈఈ కార్యాలయం వద్ద సీపీఎం నాయకుల నిరసన

దర్శి: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై సర్‌చార్జీలు పేరుతో భారం మోపవద్దని సీపీఎం దర్శి నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు అన్నారు. స్థానిక విద్యుత్ శాఖ ఈఈ కార్యాలయం వద్ద విద్యుత్ ఇందన సర్దుబాటు చార్జీలను వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ప్లకార్డులతో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తాండవ రంగారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ట్రూఆఫ్, సర్దుబాటు సర్‌చార్జీలు పెంచమని చెప్పి 100 రోజుల్లోనే 2022-23 సంవత్సరాలకు ఇంధన సర్దుబాటు చార్జీల కింద రూ.8113 కోట్లు, 2023-24 సంవత్సరాలకు రూ.10890 కోట్లు మొత్తం కలిపి రూ.19 వేల కోట్లు పెంచేందుకు డిస్ట్రి బ్యూటర్ కమిటీలు సిద్ధం అవుతున్నాయని, దీనికి ప్రజాభిప్రాయ సేకరణ కూడా జరుపుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి విద్యుత్ చార్జీలు పెంచి నెపం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై నెట్టి తామేమీ చేయలేమని చెప్పడం అన్యాయమన్నారు. ప్రజలపై భారాలు మోపడం కూటమి ప్రభుత్వం నాటకాలు ఆడటం తగదన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించవద్దని సూచించారు. అనంతరం ఈఈ కార్యాలయంలో జేఈఓ షేక్ మహబూబ్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకులు సందు వెంకటేశ్వరరావు, కేవీ పిచ్చయ్య, ఉప్పు నారాయణ, ఆదినారాయణ, ఈమని నాగేశ్వరరావు, గర్నెపూడి జాన్ సామ్యేల్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి

ముండ్లమూరు (దర్శి): విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఆంజనేయులు మాట్లాడుతూ నిత్యావసర వస్తువులు నింగి నంటుతున్నాయని, మరో వైపు కరువు, వరదలు వెంటాడుతున్నాయన్నారు. ఈ స్థితిలో ప్రజలకు ఉపశమనం కల్పించకపోగా విద్యుత్ సబ్ చార్జీల పేరుతో రూ.8113 కోట్లు ప్రజల మీద భారం మోపుతున్నారన్నారు. 2023-24కు సంబంధించి మరో రూ.11 వేల కోట్లకుపైగా సర్దుబాటు చార్జీలు సిద్ధం చేస్తున్నారని మండిపడ్డారు. మొత్తం రూ.20 వేల కోట్ల వరకు భారం వేయడానికి సిద్ధపడుతున్నారని చెప్పారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వామపక్షాలు వీరోచితంగా పోరాడి ముగ్గురు కార్యకర్తలు వీరమరణం పొందారని గుర్తు చేశారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందన్నారు. అనంతరం విద్యుత్ ఏడీకి అర్జీ ఇచ్చారు. నాయకులు హనుమంతరావు, సత్యం, రమేష్, ఎర్రయ్య పాల్గొన్నారు.

పంటలు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలి

దర్శి: రైతులు పంటలు నష్టపోకుండా శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు తగు నివారణ చర్యలు తీసుకోవాలని ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు డాక్టర్ జీ శివనారాయణ సూచించారు. స్థానిక కేవీకే ను శివనారాయణ శుక్రవారం సందర్శించారు. వరి క్షేత్రాలను పరిశీలించి తగు సూచనలు సలహాలు చేశారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జీ రమేష్ కేవీకేలో జరుగుతున్న వివిధ ప్రదర్శనలు, క్షేత్ర స్థాయి వివరాల గురించి తెలియజేశారు. శివనారాయణ మాట్లాడుతూ వరి క్షేత్రాల్లో ప్రస్తుతం ఉల్లి కోడు ఉధృతిని గమనించామన్నారు. పంట నూర్పిడికి ధాన్యాన్ని ఆరబెట్టకోవడానికి ఉపయోగపడే తార్పొలిన్ షీట్స్‌ను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ టీ వెంకటేశ్వరరెడ్డి, గృహవిజ్ఞాన శాస్త్రవేత్త టీ మానస, గ్రామ రైతులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మార్కాపురం డివిజన్
99516 02963 (మార్కాపురం)
99122 25435 (గిద్దలూరు)
Office mail : sakshiongads@gmail.com